# విషకుసుమం

"కావ్యా"

"ఊఁ"

"ఎంత అందమైన పేరు నీది. శృంగార కావ్యాలు, అందులో కవుల వర్ణనలు, ఎన్నో అనుభూతులు. చాలా సార్లు అడగాలనుకున్నాను. ఈ పేరు- ఇంత చక్కటి పేరు నీకెవరు పెట్టారు.?" తళతళ మెరుస్తున్న అందమైన కావ్య కళ్ళల్లో కాంతుల్ని చూస్తూ, ఆమె ముంగురులతో ఆటాడుతూ అడిగాడు చంద్రం.

"చంద్రా! ఈ పేరు నేనే పెట్టుకున్నాను. అమ్మ నాన్న పెట్టిన పేరెప్పుడో మర్చిపోయాను. ఈ వెన్నెల వేళ నువ్వు కావ్యా! అని పిలుస్తుంటే ఎంత హాయిగా ఉంతో- మనసెంత ఉల్లాసంగా ఉందో- కాలం ఇక్కడే స్తంభించి పోకూడదూ!...." కావ్య చంద్రం చేతివేళ్ళు మృదువుగా నిమురుతూ ఏదో మత్తులో మాట్లాడుతుంటే ఇద్దరూ విహరిస్తోంది స్వర్గలోక ప్రాంగణంలోనే.

ఇద్దరూ వెన్నెల విహారాలు చేశారు. తోటల్లో తిరిగారు. ఒకరిని వదిలి ఒకరు ఉండలేని ఉజ్వల ప్రేమకాంతిలో తడిసి సయ్యాటలాడుకున్నారు. అది ప్రేమో, వ్యామోహమో, ఆకర్షణో- పరిచయం ఏర్పడ్డ ఆ క్షణాల విలువ ఎటువంటితో కానీ కావ్య కళ్ళముందు ప్రతిక్షణం

చంద్రమే, "చంద్రా! నేనొక్క-క్షణం కూడా నిన్నువదిలి బతకలేను. నా మనసు, నాఅణువ ప్రతిక్షణం నిన్నే కోరుకుంటున్నె. రిజిష్టరాఫీసులోనో, గుళ్ళోనో నన్ను నీదాన్ని చేసుకో...."

"ఇప్పుడు నువ్వు నాదానివి కాదా! నీ శరీరంలో నాకు తెలియని అణువంటూ ఉందా?" చంద్రం పరిహసించాడు.

"మెళ్ళో మూడుముళ్లు పడ్డప్పుడు కదా ఇద్దరు ఆడమగ మధ్య సంబంధం శాశ్వతం కావడం." అంది కావ్య.

"అబ్బో! మాటలు బ్రహ్మాండంగా మాట్లాడటం నేర్చుకున్నావ్. సరే, నీ ఇష్టప్రకారమే గుళ్ళో కాకపోతే ఇప్పుడే, ఇక్క-డే నీ మెళ్లో తాళికట్టేస్తాను. దానికి అభ్యంతరం ఏమీలేదు. ఎటొచ్చి ఉద్యోగం సద్యోగం లేని వాణ్ని- మీ కుటుంబమూ అంతంత మాత్రమే. మరి మనం ఏం తిని బతుకుదాం? తరువాత నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి... నాకు పెళ్లి సంబంధాలు తెగవస్తున్నె..."

"ఆఁ..." అంటూ ఇంకా మాట్లాడబోయిన కావ్యను మధ్యలో ఆపేస్తూ,

"నేను చెప్పేది నువ్వు విన్నాక నువ్వు చెప్పేది నేను వింటాను. ఆఁ అదీ, అట్లా వినాలి మాట! నాకు మొన్నో సంబంధం వచ్చింది. మా కుటుంబం, మర్యాద, నాచదువు- పిల్లాడు బుద్ధిమంతుడు, ఒక్క-కొడుకును గనక ఉన్న ఇల్లు నాది అవుతుందన్న ఈ అన్ని అంశాలు ఒప్పుకుని

ఓ లక్ష కట్నం ఇస్తామన్నారు. నా ఉద్యోగ ప్రయత్నం కూడా వాళ్ళే చేస్తామన్నారు."

"అన్నీ ఈ ముఖం చూసి...."

"అదిగో మధ్యలో రావద్దన్నానా?...."

"సరే, రాన్లే చెప్పు...."

"మా అమ్మకి లక్ష కట్నం వదులుకోవడం ఇష్టంలేదు. అమ్మా యేం పెద్ద అందగత్తె కాదనుకో- డబ్బు గురించే నేను ఆలోచిస్తున్నాను...."

"అసలివన్నీ చెప్పడంలో నీ ఉద్దేశమేంటో చెప్పాక మిగిలిన నీ మాటలు వింటాను. ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించి నా శరీరాన్ని, మనసునూ నీకు అర్పించిన తరువాత ఇప్పుడు ఎవరి గురించో.." ఉడుక్కుంది కావ్య ముద్దుగా.

"నువ్వే నా జీవిత సర్వస్వమని ఏనాడో చెప్పానుగా కావ్యా! ఎందుకంతగా ఉడుక్కుంటావ్?"

"మరి?" రెప్పలల్లార్చింది కావ్య,

ఆ కనురెప్పల మీద ముద్దు పెట్టుకుని ఆమెను తన కౌగిట్లో పొదువుకుని "నువ్వులేని ఈ చంద్రం లేడు- వీడి జీవితం లేదు...." అన్నాడు వేడెక్కిన శరీరంతో.

"నీ ఐడియా బాగానే ఉంది. లక్ష కట్నంతో వచ్చే ఆ అమ్మాయిని పెళ్లిచేసుకో...." అంది కావ్య అతని స్పర్శలోని మత్తులో సోలిపోతూ....

"మరి నువ్వు"

"ఆలోచిద్దాంలే.... అయినా క్షణాలు వృథా చెయ్యకు చంద్రా.... రా...." విస్కీ మత్తులాంటి కిక్ ఇచ్చే చంద్రంతో అనుభవం ఆమెకు పదేపదే కావాలి. శరీరం పువ్వులా నలిగిపోవాలి.

లక్ష కట్నంతో- ఇంకా లాంఛనాలతో చంద్రం భార్యగా అడుగు పెట్టిన శారద ఈ కాలం పిల్లకాదు. అమాయకంగా భర్తే దైవమని నమ్మే పిచ్చిపిల్ల. ఎన్నో ఆశలతో, ఏవో అందమైన ఊహలతో మెట్టినింట అడుగు పెట్టిందామె.

ఇప్పుడు శారద తనసొంత ఆస్తి, కొత్తరుచి- ఆమెతో ఓపదిహేను రోజులు కావ్య వూసులేకుండా ఆనంద లోకాల్లో తేలిపోయినాడు. మొదటి రోజు భర్త దగ్గర తల ఎత్తడానికి కూడా సిగ్గుపడ్డ శారద నాలుగురోజులయ్యేసరికి తానూ అతనితో ఆనందం పంచుకుని తన అందాన్ని మనస్ఫూర్తిగా అతనికి అందించింది. అయితే ఇదంతా శాశ్వతమనీ, చంద్రం లాంటి భర్త తనకు దొరకడం అదృష్టమనీ భ్రమపడటమొకటే ఆమె చేసిన పొరపాటు.

*　　*　　*

ఆ రోజు కావ్య దగ్గర కు వచ్చాడు చంద్రం. ఆమె అప్పటికే అతని కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తోంది. అతని పొందు

కోరుకుంటున్న శరీరాన్ని మభ్యపెట్టలేక పిచ్చెత్తి పోతోంది. అతను హాయిగా భార్య కౌగిట్లో సుఖాన్ని జుర్రుకుంటుంటాడన్న ఆలోచనతో మనసు మరింత అవిశ్రాంతమవుతోంది. చంద్రం తనవాడు, తన సొంతం అతని మీద ఎవరి నీడా పడటానికి వీల్లేదు. తనను సుఖాలలో తేల్చిన అతని అణువణువుతో బాంధవ్యం తనదేకానీ దాన్ని ఇంకోళ్లు వశపర్చుకోడానికి వీల్లేదు. అయినా చంద్రాన్ని ఆ పెళ్ళిచేసుకొమ్మని ప్రోత్సహించింది. తనదే తప్పు. ఇప్పుడు అతడు పూర్తిగా ఆమెవైపు మళ్ళిపోతే తన గతి? తనను మర్చిపోయె పరిస్థితే వస్తే..

చిగురుటాకులా వణికింది కావ్య. మనసు కదిలి పోయి దుఃఖాశ్రువులు చెక్కిళ్ళ మీదుగా జాలువారుతున్నప్పుడు శూన్యంలోకి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగి ఉంది. వెనుకగా వచ్చి చటుక్కున కళ్లమూసిన చంద్రం స్పర్శను గుర్తించి అతడిని కౌగిలించుకుని భారం తీరే వరకు వెక్కిళ్లు పడుతూనే ఉంది కావ్య.

"ఛ! ఏమిటిది కావ్యా! నీకేమన్నా పిచ్చా! నీకు నేనున్నాను కదా!..." ఆమెను అక్కున చేర్చి ఆశ్వాసించాడు.

"నన్ను మర్చిపోయావేమో అనుకున్నాను...." ఇంకా కావ్య గొంతులో ఏడుపు జీరలో బాధ ధ్వనించింది.

"కావ్యా! జీవితంలో కడదాకా కలిసి బతకాల్సిన వాళ్ళం. నిన్ను మర్చిపోవడమేమిటి?...."

"ఏమో! తాళికట్టిన భార్య సర్వస్వమంటే నేనేం చెయ్యగలను?...."

"కావ్యా! నువ్వు గుర్తుకురాని క్షణం లేదంటే నమ్ము. నువ్వు ఇంత పిచ్చి ఎక్కించెయ్యగలవనికానీ, నీలో ఇంత ఆకర్షణ ఉందనీ గానీ ఊహించలేకపోయాను...."

"మరి ఇన్నాళ్ళలో- ఈ పదహారురోజుల్లో నీకు ఒక గంటన్నా టైమ్ దొరకలేదా- నన్ను చూడాలని అనిపించలేదా?...." కావ్య ప్రేమ ఆమె కళ్ళల్లో రెపరెపలాడింది.

"కొత్తపెళ్ళికొడుకును కదా! అసలు కదలనీయలేదు. అవకాశం రాగానే రెక్కలు కట్టుకొని నీ సందిట వాలాను. లే, కళ్ళు తుడుచుకో...." ఆమెను, లాలనగా ఊరడించాడు.

"నీ భార్య నాకంటే అందంగా ఉందా?...."

"ఇప్పుడా సంగతి ఎందుకు చెప్పు..."

"ఊఁ సరే, పోన్లే- లక్షరూపాయలు కట్నం డబ్బు నీ చేతికి వచ్చిందా?..."

"ఆ వచ్చింది"

"ఆ డబ్బు ఇప్పుడెవరి దగ్గరుంది?"

"నా పేర్నే బ్యాంకులో ఉంది" అన్నాడు చంద్రం.

"ఇక ఇప్పుడు చెప్పు మన కార్యక్రమం. నువ్వు చేసుకున్న ఆ అమ్మాయి మీద కూడా నువ్వు ప్రేమ పెంచుకుంటే నాది అధోగతే... మనకాకావలసిన డబ్బు వచ్చింది- అసలిప్పుడు నీ ఐడియా ఏమన్నా మారిందా, అదే దృష్టివుందా?..." కావ్య సూటిగా అసలు విషయంలోకి వచ్చేసింది.

"కావ్యా! మనం అనుకున్న ప్రకారం చేద్దాం. ప్రపంచం తలకిందులైనా, ఈ జగత్తు గతి తప్పినా ఈ చంద్రం నీవాడు, సరేనా..." ఆ మాటలకి తృప్తిగా గాలి పీల్చుకుంది కావ్య.

"ఎవరికీ అనుమానం రాని విధంగా శారద అడ్డు తొలిగించేసుకోవాలి."

ఒక్కక్షణం చంద్రం ఉలిక్కిపడ్డాడు. ఆ ఉలికిపాటు కావ్య దృష్టి దాటిపోలేదు. ఆమె మనసులో భయం నాటుకుపోయింది. తాను డబ్బు కోసం ఆడిన నాటకం చంద్రాన్ని తనకు దూరం చెయ్యదుకదా!

"ఏమిటాలోచిస్తున్నావ్?" కావ్య మళ్ళీ నిలదీసింది చంద్రాన్ని.

" అఁహాఁ శారద మనకు అడ్డేం ఉంది? ఏదో..."

అతని మాట పూర్తికాకముందే కస్సుమని తాచుపాములా లేచింది కావ్య. ఆమె బుసలకు అదిరి పడ్డాడు చంద్రం.

కావ్య కళ్ళు రౌద్రంతో ఎరుపెక్కినై. "ఛీ! నీ ప్రేమ నిజమని నమ్మి మోసపోయాను." అంది.

"ఎందుకంత ఆవేశం నీకు? నీ ఇష్ట ప్రకారమే చేద్దాం కూర్చో.... అఁ ఇప్పుడు కాస్త ప్రశాంతంగా మాట్లాడు."

"ఇద్దరం కలిసి అనుమానం రాని నాటక మాడాలి...." అంటూ ఆ విషయమై కావ్య, చంద్రం ఇద్దరూ కొంతసేపు చర్చించుకున్నారు.

ఆ తరువాత ఆమె అతని కౌగిట్లో సేదదీరాక అతను వెళ్ళి పోయాడు.

* * *

"శారదా! ఈమె నా స్నేహితురాలు కావ్య" కావ్యను శారదకు పరిచయం చేశాడు చంద్రం.

శారద కావ్యను తమ ఇంటికి వచ్చిన అతిధిగా మర్యాద చేసింది. ఆప్యాయంగా వివరాలడిగింది. కాఫీ ఇచ్చింది. కావ్య కళ్లు మాత్రం అసూయతో మండిపోతున్నై. శారద మాట్లాడినంత నిష్కల్మషంగా మాట్లాడలేకపోతోంది కావ్య ఎక్కడో ఏదో లోపం...."

ఎక్కువ సేపు కూర్చోలేక పోయింది. ఏదో అంపశయ్యమీద కూర్చున్నట్లుంది. ఈమె తన చంద్రంతో, చంద్రం పక్కలో, అతణ్ని పెనవేసుకుని తనలాగా.... ఆ ఊహే భరించరానిదిగా ఉంది. శారద చావు ముహూర్తం పెట్టక తప్పదు.... ఆమె అడిగే ప్రశ్నలకూ్కడా అన్యమనస్కంగా అవునూ, కాదు అని సమాధానం చెప్తోంది తప్ప మనసుకు పిచ్చెక్కినట్లుంది. ఇది తను చేజేతులా చేసుకుంది.

"అప్పుడే లేచారేం-మా ఇల్లు మీకు నచ్చలేదా?" లేచి నుంచున్న కావ్యను ప్రశ్నించింది శారద.

"ఆఁహఁ అదేం కాదు. ఇంట్లో చెప్పి రాలేదు . ఇంకోసారి మళ్ళీ వస్తాను...." అంది.

ఆ రోజు తరవాతకూడా కావ్య చాలాసార్లు వచ్చింది శారద దగ్గరకు.

చంద్రానికి కావ్యమీద ఎంత ప్రేమ ఉన్నా అర్ధాంగిగా అడుగు పెట్టిన శారదను చులకన చెయ్యలేదు. నిజానికి ఎంచడానికి ఆమెలో ఏ లోపంలేదు. దాంతో మానసిక సంఘర్షణకులోనై శారద జీవితాన్ని తాను నాశనం చేస్తున్నానే, అన్న భావంతో మధన పడటం మొదలు పెట్టాడు. ముభావంగా ఉంటున్న చంద్రం వాలకం బాగా గమనిస్తూనే ఉంది కావ్య.

అతని బలహీనత కని పెట్టి- ఆమె హెచ్చరిస్తూనే ఉంది, బెదిరిస్తూనే ఉంది. అనుకున్నది ఆచరణలో పెట్టెయ్యాలని తెగ తొందరపడుతోంది.

"చివరికి ఊఁ అని చంద్రం నోట్లోంచి వచ్చింది ఒప్పుదలలో, మూలుగో ఆమెకి అర్థం కాలేదు.

* * *

ఆ రోజు

సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. వాన వచ్చే సూచనగా చల్లటిగాలివీస్తోంది.

శారద ఆ చల్లటి గాలికి పైన డాబామీదికి వెళ్దాం అనుకుంటుండగా కావ్య గేటు తీసుకుని లోపలికి వస్తోంది.

కడిగిన ముత్యంలా ఉన్న శారదను చూసి అడిగింది కావ్య, "బయటికి వెళ్ళబోతున్నారా?" అని.

"అహఁ లేదండీ- చల్లటిగాలి వస్తోంది కదా! అట్లా డాబామీద

కూర్చుని ఆనందించడం నాకు చాలా ఇష్టం. రండి లోపలికి వెళ్దాం...." అంటూ ఇంట్లోకి దారితీసిన శారదను వారించింది కావ్య.

"పదండి పైనే కూర్చుందాం- నేనూ వస్తాను...." అంది మెట్ల వైపు దారితీస్తూ.

ఈ ఇద్దరూ మెట్లెక్కి పైకి వెళ్ళబోతున్నప్పుడు చంద్రం వచ్చాడు బయటి నుంచి. వాళ్లు వెళ్ళింది గమనించనట్లుండి పోయినాడు. కావ్యను చూస్తే ఓరకమైన జంకుగా ఉంది. కొంచెం సేపాగి మెల్లగా తనూ మెట్లెక్కసాగాడు.

కావ్య, శారద పిట్టగోడదాకా వెళ్ళి చుట్టూ ఉన్న దృశ్యాలు చూస్తూ, చల్లటి గాలిని అనుభవిస్తున్నారు. శారద తనకిష్టమైన సినిమాల గురించి మాట్లాడింది. ఆ తరువాత ఘంటసాల పాడిన పాటల గురించి మాట్లాడింది.

"కావ్యగారూ! నాకు ఘంటసాల పాడినపాటల్లో "రాగమయీరావే, జగమేమారినదీ మదురముగా ఈవేళ- ఈ రెండూ ఎంత ఇష్టమో చెప్ప లేను. ఆ పాటలు వింటుంటే మనసు ఏదో లోకంలోకి వెళ్ళిపోతుంది...." ఇంకా "నిలువుమా నిలువుమా నీలవేణి...." పిట్టగోడమీద కూర్చుని ఎదురింట్లో గాలికి కదలాడుతున్న కొబ్బరి చెట్టును చూస్తూ చెప్తున్న శారద రెండు మూడు క్షణాలు కావ్యవైపు దృష్టి తిప్పలేదు.

ఆ అవకాశాన్నామె జారవిడుచుకోలేదు. అంతే.... ఆమె తల

ఇటు తిప్పేలోపలే ప్రమాదం జరిగిపోయింది. మూడంతస్తుల పైనుంచి శారద కింద పడిపోయింది నిర్జీవంగా. ఆమె నూరేళ్ళ జీవితం, యవ్వనం ప్రథమ దశలో, ఏ అనుభవాలు, అనుభూతులు చవిచూడకముందే రాలి పోయింది.

పైకి అప్పుడే వస్తున్న చంద్రం కెవ్వున కేకవేశాడు. కావ్యకు కొద్దిక్ష ణాలు అయోమయమైంది. కానీ తేరుకుని రివ్వున మెట్లమీదుగా కిందికి పరి గెత్తింది. "శారద జారిపడిపోయింది" అని ఆ భవంతి దద్దరిల్లేట్లు కేకలు పెడుతూ. ఆమె వెనకే చంద్రం పరిగెత్తాడు.

శారద అన్యాయపు చావుకి అతని కళ్ళల్లో నీళ్లు ఉబుకుతూనేఉన్నై.

తన 'మంచి స్నేహితురాలు' పోయినందుకు ఆమె మీదపడి వెక్కి వెక్కి ఏడ్చింది కావ్య. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనకు నిమిషాలమీద జమ అయిన వారంతా రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పెళ్ళై రెండు నెలలైనా తిరక్కముందే చనిపోయిన ఆమె గురించి సానుభూతి చూపిస్తు న్నారు మరికొందరు. ఏమైనా శారద కథ అసంపూర్తిగా ముగిసి పోయింది.

నాలుగు రోజులు కలవరపడ్డ కావ్య, చంద్రం మరో నాలుగు రోజులకి అన్నీ మర్చిపోయినారు.

తన గుండెల్లో బాధ మర్చిపోవడానికి ఒక తోడుకావాలని తన తల్లితో మాటమాత్రంగా చెప్పాడు. అతివినయంగా శారద తల్లితండ్రులకు

కన్నీటిధార మధ్య తాను కావ్యను పెళ్ళిచేసుకోబోతున్నట్లు ప్రకటించాడు- వారివ్వగల సమాధానమేం ఉంటుంది? కన్నీటి పొరలమధ్య చంద్రం మాటకు సరేనన్నారు.

ఇప్పుడు కావ్య చంద్రం భార్య. హాయిగా నడిచి వచ్చేసింది అతని జీవితంలోకి. శారద నగలు, చీరలు ఇప్పుడు కావ్య పరమయినై. వెన్నెల పాన్పుమీద మల్లెల తోరణాల నడుమ ఏమీ ఎరుగని దానిలా చంద్రం పరిష్వంగంలో కావ్య మత్తుగా, గమ్మత్తుగా నవ్వుతోంది. ఆ నవ్వులో తాను గెలిచానన్న అహం వక్రంగా మెరుస్తోంది. న్యాయం అన్యాయంగా నలిగిపోయింది.

(ఉదయం ఆదివారం అనుబంధం 12-6-88)